# మోదీకి సంకీర్ణ సెగ

- ప్రభుత్వం ఏర్పాటు కాకముందే ఎన్డీయే కూటమిలో కాక మొదలు
- అగ్నిపథ్ పథకాన్ని సమీక్షించాలన్న భాగస్వామ్య పక్షాలు జేడీయూ, ఎల్జేపీ
- కన్వీనర్ పోస్ట్ డిమాండ్ చేస్తున్న టీడీపీ

న్యూఢిల్లీ, జూన్ 6: కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు కాకముందే ఎన్డీయేలో కాక మొదలైంది. ఇప్పటిదాకా ఎన్డీయేలో బీజేపీ ఏ నిర్ణయం తీసుకొన్నా ఎదురులేకుండా పోయేది. కానీ, ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటులో బీజేపీకి మిత్రపక్షాల మద్దతు తప్పనిసరి అయ్యింది. ఈ నేపథ్యంలో ఆయా పార్టీలు తమ డిమాండ్లను బీజేపీ ముందు ఉంచుతున్నాయి. తాజాగా, అగ్నిపథ్ పథకంపై ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన జేడీయూ, లోక్‌జన్‌శక్తి (రామ్‌విలాస్ పాశ్వాన్) పార్టీలు కీలక వ్యాఖ్యలు చేశాయి. ఈ పథకాన్ని సమీక్షించాలని డిమాండ్ చేశాయి.



**బేషరతు మద్దతు అంటూనే..**

ఎన్డీయేకు బేషరతు మద్దతు తెలుపుతున్నామని పేర్కొంటూనే.. బీజేపీ ముందు జేడీయూ పలు డిమాండ్లు ఉంచింది. త్రివిధ దళాల్లో నియామకాల కోసం మోదీ సర్కారు తీసుకొచ్చిన అగ్నిపథ్ స్కీమ్‌ను సమీక్షించాల్సిన అవసరం ఉన్నదని జేడీయూ నేత కేసీ త్యాగి అన్నారు. ఈ పథకంపై చాలా వ్యతిరేకత వ్యక్తమయిందని, ఎన్నికల్లోనూ దీని ప్రభావం పడిందని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వంతో తాము ఘర్షణ పడాలని కోరుకోవడం లేదని పేర్కొన్న ఆయన.. పథకం తీసుకొచ్చినప్పుడు సాయుధ బలగాలు, వారి కుటుంబ సభ్యుల నుంచి వ్యతిరేకత వ్యక్తమయిందని గుర్తు చేశారు. కాబట్టి దీనిపై చర్చించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి పౌరస్మృతికి తాము వ్యతిరేకంగా కాదని, అయితే దీనిపై అన్ని భాగస్వామ్య పక్షాలతో చర్చించి ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కోరుతామన్నారు. మరోవైపు, ఎల్జేపీ అధినేత చిరాగ్ పాశ్వాన్ కూడా అగ్నిపథ్ పథకాన్ని సమీక్షించాలని కోరారు. ఎన్డీయే విజయానంతరం తొలిసారి ఓ ఆంగ్ల చానెల్‌కు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. దేశవ్యాప్త కులగణనకు తాము మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. 'ప్రభుత్వం వద్ద ఈ సమాచారం ఉండటం చాలా అవసరం. అయితే, దాన్ని బహిర్గతం చేయాలా? వద్దా? అంటే చేయొద్దు అనే చెప్తా. ఎందుకంటే ఆ డాటా బహిర్గతమైతే సమాజంలో విభేదాలు తలెత్తుతాయి' అని వివరించారు.

**ఎన్డీయే కన్వీనర్ పోస్టుకు టీడీపీ ఎసరు!**

ఎన్డీయేలో బీజేపీ తర్వాత అత్యధిక మెజారిటీ కలిగిన పార్టీ టీడీపీ. ఆ పార్టీ స్పీకర్, పలు మంత్రిత్వ శాఖలను డిమాండ్ చేస్తుందన్న వార్తలు వచ్చాయి. అయితే, వాటన్నింటికన్నా ఎన్డీయే కన్వీనర్ పోస్టుకే గురి పెట్టినట్టు తెలుస్తున్నది. 'మిత్రపక్షాలు అడిగే డిమాండ్లకు బీజేపీ నాయకత్వం సానుకూలంగా స్పందించే అవకాశం ఉన్నది. బీహార్, ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ లాంటివి అందించటానికి రెడీగా ఉంటుంది. కానీ, లోక్‌సభ స్పీకర్, ఎన్డీయే కన్వీనర్ లాంటి డిమాండ్లపై సానుకూలత రాకపోవచ్చు' అని బీజేపీ సన్నిహితవర్గాలు వెల్లడించాయి. అయితే, వాజ్‌పేయి ప్రభుత్వంలో ఎన్డీయే కన్వీనర్‌గా చంద్రబాబునాయుడు వ్యవహరించారు. లోక్‌సభ స్పీకర్‌గా టీడీపీకే అవకాశం దక్కింది. జీఎంసీ బాలయోగి స్పీకర్‌గా వ్యవహరించారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్, ఎన్డీయే కన్వీనర్ పోస్టులు టీడీపీకి అప్పగిస్తారా? లేదా? అన్నది చూడాలి.

**మిత్రపక్షాల నుంచి వెల్లువెత్తుతున్న డిమాండ్లు**

ఎన్డీయేలో భాగస్వామి అయిన జేడీయూ కూడా పలు డిమాండ్లను బీజేపీ ముందు ఉంచే అవకాశం ఉన్నది. జేడీయూ నేత, బీహార్ సీఎం నితీశ్ కుమార్.. బీహార్‌కు ప్రత్యేక హోదాతో పాటు పలు కీలక మంత్రిత్వ శాఖలను కోరుతున్నట్టు సమాచారం. గ్రామీణాభివృద్ధిశాఖ, రక్షణ, రైల్వే, వ్యవసాయం సహా రెండు సహాయ మంత్రిత్వశాఖలను కోరుతున్నట్టు తెలుస్తున్నది. రాజ్యసభ వైస్‌చైర్మన్ పోస్టుకు కూడా గాలం వేసినట్టు సమాచారం. ఇక, మరో మిత్రపక్షం జేడీఎస్ కూడా పలు డిమాండ్లను బీజేపీ ముందుంచింది. తమకు వ్యవసాయశాఖపై ఆసక్తి ఉన్నట్టు ఆ పార్టీ నేత హెచ్‌డీ కుమారస్వామి హింట్ ఇచ్చారు. తాము మొదట్నుంచీ రైతుల కోసమే పోరాడుతున్నామని, ఆ శాఖపై తమ పార్టీ ఆసక్తి కనబరుస్తున్నదని వెల్లడించారు. అయితే, శుక్రవారం జరిగే ఎన్డీయే పార్లమెంటరీ సమావేశం తర్వాత ఈ డిమాండ్లపై క్లారిటీ రానున్నది.




## మోదీ ప్రమాణం 9కి మార్పు!

- ప్రమాణ స్వీకారానికి వివిధ దేశాధినేతలకు ఆహ్వానం
- నేడు మోదీని తమ నేతగా ఎన్నుకోనున్న ఎన్డీయే ఎంపీలు

న్యూఢిల్లీ, జూన్ 6: దేశానికి మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ 9న ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. తొలుత ఆయన శనివారం ప్రమాణం చేస్తారని వార్తలు వెలువడగా, దానిని ఆదివారం సాయంత్రానికి మార్చినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. స్వతంత్ర భారతంలో జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రమాణం చేస్తున్న వారిలో మోదీ రెండో వారు. కాగా, మోదీని తమ నేతగా ఎన్నుకునేందుకు శుక్రవారం ఎన్డీయే నేతలు సమావేశం కానున్నారు. మోదీని ఎన్నుకున్న తర్వాత ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న సీనియర్ నేతలు నారా చంద్రబాబునాయుడు, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ తదితరులు ప్రధానితో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుస్తారు. తమ కూటమికి మద్దతు ఇస్తున్న ఎంపీల లిస్టును వారు రాష్ట్రపతికి సమర్పిస్తారు. మరోవైపు మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి పలు దేశాల అధినేతలకు ఆహ్వానం పంపారు. బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులు, నేపాల్, భూటాన్, మారిషస్, సీసెల్స్ దేశాధినేతలు హాజరయ్యే అవకాశం ఉన్నదని అధికార వర్గాలు తెలిపాయి.



కొత్తగా తరలించిన చోట కొనసాగుతున్న విగ్రహాల ప్రతిష్ఠ పనులు

## గాంధీ, అంబేద్కర్ విగ్రహాల తరలింపు

- పార్లమెంట్ ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వం చర్యపై కాంగ్రెస్ ఆగ్రహం
- 400 సీట్లు ఇచ్చుంటే రాజ్యాంగాన్నీ వదిలిపెట్టేవారు కాదేమోనని విమర్శ

న్యూఢిల్లీ, జూన్ 6: పార్లమెంట్ ప్రాంగణంలో గాంధీజీ, అంబేద్కర్, ఛత్రపతి శివాజీ తదితర మహనీయుల విగ్రహాలను మరో చోటుకు తరలించడంపై వివాదం రేగింది. పాత పార్లమెంట్ భవనం,పార్లమెంట్ గ్రంథాలయం మధ్య ఉన్న పార్క్ వద్దకు వీటిని మార్చారు. కాంగ్రెస్ మీడియా విభాగాధిపతి పవన్ ఖేరా ఎక్స్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మహారాష్ట్ర ఓటర్లు బీజేపీకి ఓటేయలేదని శివాజీ, అంబేద్కర్ విగ్రహాలను తొలగించారు. గుజరాత్‌లో తాము క్లీన్‌స్వీప్ చేయలేదని గాంధీజీ విగ్రహాన్నీ పక్కకు తరలించారు. వాళ్లకు 400 సీట్లు ఇచ్చుంటే రాజ్యాంగాన్నీ వదిలిపెట్టేవారు కాదేమో' అని ఆయన ట్వీట్ చేశారు. ఈ నెలలో పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో పార్లమెంట్ ప్రాంగణాన్ని నవీకరిస్తున్నారు. ఇందులో భాగంగా జాతీయ నాయకుల విగ్రహాలను పార్లమెంట్ ప్రాంగణంలోనే వేరే చోటికి తరలిస్తున్నారు. విగ్రహాల తరలింపు ద్వారా ఏర్పడిన ఖాళీ స్థలంలో రాష్ట్రపతి, ప్రధాని కొత్త పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించే మార్గాలను నిర్మిస్తున్నారు.

## అయోధ్యలో ఎందుకు ఓడింది?

న్యూఢిల్లీ, జూన్ 6: కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకోవడానికి అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ దారుణంగా దెబ్బతిన్నది. 2019లో యూపీలో 62 స్థానాలు గెలుచుకున్న బీజేపీ.. ఈసారి కేవలం 33 స్థానాలకు పరిమితమైంది. అయోధ్య రామమందిరం నిర్మాణం జరుపుకున్న ఫైజాబాద్ స్థానంలోనూ బీజేపీ ఓడింది. 'అభ్యర్థుల ఎంపికలో సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను పార్టీ అధిష్ఠానం పక్కకు పెట్టింది. ఈ అంశం ఆర్ఎస్ఎస్‌లో చర్చనీయాంశమైంది. రాష్ట్ర నాయకత్వం అభ్యంతరం తెలిపినప్పటికీ, 62 సిట్టింగ్ స్థానాల్లో 55 మందికి హైకమాండ్ తిరిగి టికెట్లు ఇచ్చింది' అని యూపీ బీజేపీ నాయకుడు ఒకరు మీడియాతో చెప్పారు.

## నడ్డా ఇంట్లో బీజేపీ, ఆరెస్సెస్ నేతల భేటీ

- కేంద్ర మంత్రివర్గ కూర్పుపై చర్చ
- బాలయోగి కుమారుడికి స్పీకర్ పదవి!
- నితీశ్ పార్టీకి 3 క్యాబినెట్ బెర్తులు?

న్యూఢిల్లీ: కేంద్ర క్యాబినెట్ కూర్పునకు సంబంధించి ఓ 'ఫార్ములా'ను బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, ఆరెస్సెస్, పార్టీ ముఖ్య నేతలు ఖరారు చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ 'ఫార్ములా'ను ఎన్డీయేలోని టీడీపీ, జేడీయూ, ఎల్జేపీ సహా ఇతర భాగస్వామ్య పార్టీలకు ఆయన పంపారట. ప్రతి 5 మంది ఎంపీలకు ఒక క్యాబినెట్ బెర్త్, రెండు ఎంపీలున్న మిత్ర పక్షానికి సహాయ మంత్రి పదవిని కేటాయించేందుకు నిర్ణయించినట్టు సమాచారం. న్యూఢిల్లీలో జేపీ నడ్డా ఇంట్లో ఏర్పాటుచేసిన సమావేశానికి అమిత్ షా, రాజ్‌నాథ్, పీయూష్ గోయల్, ప్రహ్లాద్ జోషి, మాండవీయ, పార్టీ జనరల్ సెక్రెటరీలు, ఆరెస్సెస్ ముఖ్య నేతలు హాజరయ్యారు.16 మంది ఎంపీలున్న టీడీపీకి మూడు క్యాబినెట్ స్థాయి మంత్రి పదవులు, 12 మంది ఎంపీలున్న జేడీయూకు రెండు క్యాబినెట్ బెర్తులు, మరో రెండు సహాయ మంత్రి పదవులు రానున్నట్టు ఢిల్లీ రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ స్పీకర్ పదవి తమకే ఇవ్వాలని టీడీపీ, జేడీయూ పట్టుబడుతున్నాయి.

**స్పీకర్ పదవికి రామ్మోహన్, హరీష్ మాధుర్ పేర్లు పరిశీలన !**

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): లోక్‌సభ స్పీకర్, ఎన్డీయే కన్వీనర్ పదవులను టీడీపీకి ఇవ్వాలని చంద్రబాబు పట్టుబడుతున్నారని తెలిసింది. శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు, అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్‌ల పేర్లను స్పీకర్ పదవికి పరిశీలిస్తున్నట్టు వార్తలు వెలువడ్డాయి.

**కీలక శాఖలకు జేడీయూ డిమాండ్**

ఎన్డీయే సర్కార్‌లో జేడీయూకి మూడు క్యాబినెట్ బెర్తులు దక్కనున్నట్టు ఆ పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. కీలకమైన రైల్వే, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, జలవనరులు, భారీ పరిశ్రమల శాఖల మంత్రి పదవులు తాము ఆశిస్తున్నట్టు జేడీయూ వర్గాలు తాజాగా పేర్కొన్నాయి.

## ఎంపీల్లో 93% మంది కోటీశ్వరులే: ఏడీఆర్

న్యూఢిల్లీ, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల్లో 93శాతం మంది కోటీశ్వరులేనని 'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్' (ఏడీఆర్) తెలిపింది. గత ఎంపీల్లో 475 మంది మిలియనీర్లు ఉండగా, వీరి సంఖ్య ఈసారి 504కు పెరిగిందని వెల్లడించింది. ధనిక ఎంపీల్లో గుంటూరు టీడీపీ అభ్యర్థి చంద్రశేఖర్ పెమ్మసాని రూ.5,705 కోట్లతో మొదటి స్థానంలో ఉండగా, చేవెళ్ల బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి రూ.4,568 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో ఉన్నారని తెలిపింది.

**46శాతం మందిపై క్రిమినల్ కేసులు**

543 మంది ఎంపీల్లో 251 మందిపై (46శాతం) క్రిమినల్ కేసులున్నాయని, ఇందులో 27 మంది దోషులుగా తేలారని ఏడీఆర్ తెలిపింది. క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న అభ్యర్థులు లోక్‌సభకు ఈ స్థాయిలో ఎంపిక కావటం ఇదే మొదటిసారి అని పేర్కొన్నది.

**లోక్‌సభకు కొత్తవారు 280మంది**

ఈసారి 280 మంది కొత్త ఎంపీలు లోక్‌సభలో అడుగుపెట్టబోతున్నారు. లోక్‌సభలో మొత్తం 543 మంది సభ్యులు ఉండగా, వీరిలో కొత్త ఎంపీలు 52 శాతం.

## టచ్‌లో 10-15 మంది అజిత్ వర్గ ఎమ్మెల్యేలు

**శరద్ పవార్ వర్గం వెల్లడి**

ముంబై: అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి చెందిన 10-15 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని శరద్‌పవార్ వర్గం సంచలన వ్యాఖ్యలు చేసింది. తాజా ఎన్నికల్లో అజిత్ వర్గం కేవలం ఒక్కస్థానంలోనే గెలవడం, మరికొద్ది నెలల్లో మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ వార్త రాష్ట్ర రాజకీయాల్లో అలజడి రేపింది. ఎన్సీపీ (శరద్ పవార్) రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ గురువారం మీడియాతో మాట్లాడుతూ 'కొంత మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు. 10న పార్టీ వ్యవస్థాపక దినోత్సవానికి ముందు 9న నిర్వహించే సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చిస్తాం' అని ఏ పార్టీ పేరును ప్రస్తావించకుండా తెలిపారు. అయితే ఇవన్నీ వదంతులని అజిత్ వర్గం కొట్టిపారేసింది.

## అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరే

**కాంగ్రెస్‌తో పొత్తు లేదు:ఆప్**

న్యూఢిల్లీ, జూన్ 6: కాంగ్రెస్ పార్టీతో తమ పొత్తు కేవలం లోక్‌సభ ఎన్నికల వరకే పరిమితమని ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టం చేసింది. గురువారం ఆ పార్టీ ఢిల్లీ స్టేట్ కన్వీనర్ గోపాల్ రాయ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఢిల్లీకి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీకి దిగుతామన్నారు. సీఎం కేజ్రీవాల్ నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్లతో భేటీ అనంతరం ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి ఆప్ పూర్తి సహకారం అందించిందన్నారు.

**మోదీకి బదులు మరొకరు**

## ప్రధాని అయితే వారికే మద్దతు

**ఎంఐఎం చీఫ్ ఒవైసీ**

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): మోదీకి బదులు మరొకరు ప్రధాని అయ్యే అవకాశం ఉంటే వారికి మద్దతిస్తానని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. గురువారం ఏఎన్ఐతో మాట్లాడుతూ.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఇన్ని సీట్లు వచ్చి ఉండాల్సింది కాదన్నారు. 'దేశంలో ఉన్న వాతావరణం ప్రకారం బీజేపీకి ఇన్ని సీట్లు కూడా రాకూడదు. మేం సరిగ్గా పనిచేసి ఉంటే వారికి కేవలం 150 సీట్లు మాత్రమే వచ్చేవి. బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకుండా ఆపగలిగే వాళ్లం. ప్రజలు కూడా అదే కోరుకున్నారు. కానీ విజయవంతం కాలేదు' అని అన్నారు. ఒక విషయం స్పష్టంగా ఉందని, దేశంలో ఏ ముస్లిం ఓటు బ్యాంకు లేదని, ఎప్పటికీ ఉండదని చెప్పారు.

## పాండియన్ ఎక్కడ?

**బీజేడీ ఓటమి తర్వాత కనిపించని నేత**

భువనేశ్వర్, జూన్ 6: ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బిజు జనతాదళ్(బీజేడీ)లో కీలక పరిణామం చోటు చేసుకొంది. మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌ను తెర వెనుక ఉండి నడిపిస్తారని చెప్పుకొనే పాండియన్ బుధవారం నుంచి కనిపించడం లేదు.అయితే పాండియన్ తమకు కన్పించారని, ప్రజల కోసం పనిచేయమన్నారని బీజేడీ ఎమ్మెల్యే ఒకరు తెలిపారు.


# లక్ష ఎప్పుడిస్తారు?

- లక్నో కాంగ్రెస్ ఆఫీసు వద్ద మహిళల క్యూ
- ఎన్నికల వాగ్దానం అమలుకు డిమాండ్
- కుటుంబ పెద్దగా ఉన్న మహిళలకు నెలకు రూ.8,500 ఇస్తామని కాంగ్రెస్ వాగ్దానం
- ఎన్నికలకు ముందే గ్యారెంటీ కార్డుల పంపిణీ
- బెంగళూరు జీపీఓలో భారీగా ఖాతాలు ప్రారంభం

న్యూఢిల్లీ, జూన్ 6: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని మించి ఇండియా కూటమి ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక సీట్లు గెలుపొందడంతో ఆ రాష్ట్ర మహిళలు ఎన్నికల వాగ్దానం అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ కార్యాలయం వద్ద బారులు తీరారు. ప్రచారం సమయంలో వాగ్దానం చేసినట్టుగా గ్యారెంటీ కార్డులను ఇవ్వాలని వారు కాంగ్రెస్ నేతలను డిమాండ్ చేశారు. ప్రచారం సమయంలో కాంగ్రెస్ నేతలు పలువురు గృహిణులకు గ్యారెంటీ కార్డులను పంపిణీ చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే.. మహిళలు కుటుంబ పెద్దలుగా ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఏటా రూ.లక్ష అందజేస్తామని వాగ్దానం చేశారు. యూపీలో ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అధిక సీట్లను గెలుచుకుంది. రాష్ట్రంలోని మొత్తం 80 స్థానాలకు గాను ఎన్డీయే 37 సీట్లు గెలుపొందగా, ఇండియా కూటమి 43 స్థానాలను గెలుచుకుంది. దీంతో పలువురు ముస్లిం మహిళలు గురువారం లక్నోలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద బారులుతీరి తమకు గ్యారెంటీ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంతకుముందే గ్యారెంటీ కార్డులు అందుకున్న మహిళలు తమ బ్యాంకు ఖాతాల్లోకి డబ్బు వేయాలని కోరుతూ దరఖాస్తు పత్రాలు అందజేశారు. తాము అందించిన పత్రాలకు కాంగ్రెస్ కార్యాలయం రశీదులు కూడా ఇచ్చిందని పలువురు మహిళలు తెలిపారు.

**ఘర్‌ఘర్ గ్యారెంటీ!**

ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 'ఘర్ ఘర్ గ్యారెంటీ (ఇంటింటికీ గ్యారెంటీ) పథకాన్ని ప్రారంభించింది. పార్టీ వాగ్దానం చేసిన 25 గ్యారెంటీలను కనీసం ఎనిమిది కోట్ల కుటుంబాల వద్దకు చేర్చాలని నాయకులకు టార్గెట్ విధించింది. ఈ గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం ఒకటి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న, మహిళలు కుటుంబ పెద్దగా ఉన్న కుటుంబాలకు నెలకు రూ.8,500 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని వాగ్దానం చేసింది. గత ఏడాది కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో సైతం కాంగ్రెస్ పార్టీ ఇదేవిధమైన వాగ్దానం చేసింది. కుటుంబ పెద్దగా ఉన్న మహిళలకు నెలకు రూ.2000 చొప్పున అందజేస్తామని పేర్కొంది. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుంది, తమ ఖాతాల్లో నెలకు రూ.8,500 బదిలీ అవుతాయి అన్న ఆశతో ఇటీవల పలువురు మహిళలు బెంగళూరులోని జనరల్ పోస్ట్ ఆఫీసులో భారీ సంఖ్యలో ఖాతాలు ప్రారంభించారు.



తమకిచ్చిన గ్యారంటీ కార్డులతో కాంగ్రెస్ ఆఫీసుకు వచ్చిన మహిళలు



ఘటన అనంతరం కంగనకు భద్రత కల్పించి తీసుకెళుతున్న పోలీసులు

## కంగన చెంప చెళ్లు

**రైతుల ఆందోళనను అవమానించినందుకు కొట్టిన మహిళా కానిస్టేబుల్**

చండీగఢ్: మండి నియోజకవర్గ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌ను సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ చెంప దెబ్బ కొట్టారు. గురువారం చండీగఢ్ విమానాశ్రయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. భద్రత తనిఖీల సమయంలో నిందితురాలు కుల్విందర్ కౌర్ ఈ ఘటనకు పాల్పడ్డారు. ఢిల్లీ చేరుకున్న తర్వాత కంగన ఎక్స్‌లో స్పందిస్తూ... 'పంజాబ్‌లో ఉగ్రవాదం, హింస పెరిగిపోతుండటంపై షాక్‌కు గురయ్యాను. నన్నెందుకు కొట్టావని ఆమెను అడిగినప్పుడు.. రైతుల నిరసనకు మద్దతు ఇస్తున్నట్టు ఆమె నాకు చెప్పారు' అని కంగన అన్నారు. కానిస్టేబుల్ తనను కొట్టిన తర్వాత దూషించిందన్నారు. ఘటనపై కుల్విందర్ కౌర్ కూడా స్పందించారు. 'రైతులు రూ.100 కోసం ధర్నాలో కూర్చొంటున్నారని ఆమె(కంగన) గతంలో కామెంట్ చేశారు. నా తల్లి రైతుల ధర్నాలో పాల్గొన్నప్పుడు కంగన ఈ మాటలన్నారు' అని ఆమె అన్నారు. నిందితురాలిని సస్పెండ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

## రాష్ట్రపతిని కలిసిన సీఈసీ

- ఎంపీల జాబితా అందజేత
- ఎన్నికల కోడ్ ఎత్తివేత

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో సీఈసీ రాజీవ్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గురువారం రాష్ట్రపతిని కలిసి 18వ లోక్‌సభకు ఎన్నికైన ఎంపీల వివరాలను సమర్పించారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు జరిగే ప్రక్రియలో భాగంగా వారు ముగ్గురు ముర్మును కలిసినట్టు రాష్ట్రపతి భవన్ తెలిపింది. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినందుకు ఈసీకి రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. ఎన్నికలు ముగియడంతో ఎన్నికల కోడ్ ఎత్తివేస్తున్నట్టు ఈసీ ప్రకటించింది.

## తేడా 1%.. కోల్పోయిన సీట్లు 63

**భారీగా నష్టపోయిన బీజేపీ**

న్యూఢిల్లీ, జూన్ 6: తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటుచేసే స్థాయిలో సీట్లను సాధించలేకపోయింది. 2019లో 303 సీట్లు సాధించిన ఈ పార్టీ ఈసారి 240 సీట్ల వద్దనే ఆగిపోయింది. అంటే గతంలో కన్నా 63 సీట్లు తగ్గాయి. అయితే ఓట్లపరంగా చూస్తే ఈ తేడా చాలా స్వల్పంగా ఉన్నది. 2019 ఎన్నికల్లో బీజేపీ 37.7 శాతం ఓట్లు పొందగా, ఈసారి 36.56 శాతం ఓట్లు సాధించింది. అంటే కేవలం 1.20 శాతం ఓట్లు మాత్రమే తగ్గాయి. అయినప్పటికీ 63 సీట్లను కోల్పోయింది. యూపీలో ఓటింగ్ గణాంకాలు 2019 మాదిరిగానే కన్పించినప్పటికీ ఇండియా కూటమి పార్టీల మధ్య పొత్తు కమలం పార్టీని దారుణంగా దెబ్బతీసింది. ఇక దక్షిణాదిన ఆ పార్టీ ఓటింగ్ శాతాన్ని పెంచుకున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సీట్లు పెరగలేదు. ఉదాహరణకు తమిళనాడులో ఓట్ల శాతం 10 శాతానికి పెరిగినా, ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది.

**రెట్టింపు లాభపడ్డ కాంగ్రెస్**

కాంగ్రెస్ విషయంలో దానికి వ్యతిరేకంగా జరిగింది. ఆ పార్టీకి 2019లో 19.70 శాతం ఓట్లు రాగా, 2024లో 21.19 శాతం ఓట్లు వచ్చాయి. పెరిగిన ఓట్లు 1.49 శాతమే. కానీ సీట్లు దాదాపు రెట్టింపై 52 నుంచి 99కి చేరాయి.

| ఎన్నికలు | బీజేపీ సీట్లు | ఓట్‌షేర్ | కాంగ్రెస్ సీట్లు | ఓట్‌షేర్ |
|---|---|---|---|---|
| 2014 | 282 | 31.34 | 44 | 19.52 |
| 2019 | 303 | 37.76 | 52 | 19.70 |
| 2024 | 240 | 36.56 | 99 | 21.19 |

## నాడు హీరో హీరోయిన్లు.. నేడు ఎంపీలు

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, ఎల్జేపీ అధినేత చిరాగ్ పాశ్వాన్‌లకు సంబంధించిన ఓ విషయం తాజాగా ఆసక్తికరంగా మారింది. గతంలో ఓ సినిమాలో హీరో హీరోయిన్లుగా నటించిన వీరిద్దరూ.. ప్రస్తుతం పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నారు. 2011లో వచ్చిన 'మిలే నా మిలే హమ్' చిత్రంలో వీరు హీరో హీరోయిన్లుగా నటించారు. అయితే ఈ చిత్రం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో తండ్రి రాం విలాస్ పాశ్వాన్ అడుగు జాడల్లో చిరాగ్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తాజా ఎన్నికల్లో బీహార్‌లోని హాజీపూర్ నుంచి విజయం సాధించారు. ఎల్జేపీ నుంచి ఐదుగురు ఎంపీలుగా గెలుపొందారు. మరోవైపు కంగన.. బీజేపీ తరపున మండి నియోజక వర్గం నుంచి విజయం సాధించారు.

# మోదీ, షా 'స్టాక్' కుంభకోణం

- అమాయక మదుపరులను నిండా ముంచారు
- నిజాలు దాచి అబద్ధాలు ప్రచారం చేశారు
- ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను మ్యానిపులేట్ చేశారు
- 4న ఏర్పడ్డ స్టాక్ మార్కెట్ నష్టాలపై దర్యాప్తు చేయాలి
- కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 6: స్వతంత్ర భారతంలో అతిపెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణం జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం అన్నారు. దీని వెనుక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఉన్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు విడుదలైన మంగళవారం (జూన్ 4న) దేశీయ స్టాక్ మార్కెట్లు అత్యంత భారీ నష్టాలను చవిచూసిన విషయం తెలిసిందే. అయితే దీన్నో భారీ స్కామ్‌గా రాహుల్ పేర్కొన్నారు. దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) దర్యాప్తు జరుపాలని డిమాండ్ చేశారు. నిజానిజాలు తేలాలంటే విచారణ జరిగి తీరాల్సిందేనన్నారు.

**చిన్న మదుపరులకు పెద్ద నష్టం**

ఇటీవలి స్టాక్ మార్కెట్ల నష్టాలు.. చిన్న మదుపరులకు పెద్ద నష్టాలనే మిగిల్చాయని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలకు ముందు అమిత్ షా, మోదీ.. ఈసారి కూడా అధికారంలోకి వచ్చేది తామేనని, జూన్ 4న స్టాక్ మార్కెట్లు భారీ లాభాలను అందుకుంటాయని, మదుపరులు స్టాక్స్‌ను పెద్ద ఎత్తున కొనాలంటూ సలహాలిచ్చారని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 5 కోట్ల రిటైల్ మదుపరులు తమ కష్టార్జితాన్ని కోల్పోయారని ఇక్కడ విలేకరుల సమావేశంలో మండిపడ్డారు. ఆ ఒక్కరోజే మదుపరుల సంపద రూ.31 లక్షల కోట్లు పడిపోయిందని చెప్పారు. 'స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలని మదుపరులకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎందుకు సలహా ఇచ్చారు. ఈ రకమైన సలహాలు ఇవ్వడం ఏమైనా వాళ్ల పనా? ఇద్దరూ ఒకే బిజినెస్ గ్రూప్ (అదానీ గ్రూప్?) నకు చెందిన ఒకే మీడియాకు ఇంటర్వ్యూలిస్తూ అంతా పెట్టుబడులు పెట్టాలని కోరారు.



**ఎగ్జిట్ పోల్స్ ఫేక్**

జూన్ 1న వచ్చిన ఎగ్జిట్ పోల్స్ అన్నీ మోసమని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. ఇంటెలిజెన్స్ రిపోర్ట్స్ ఉన్నప్పటికీ మే నెలలో పలుమార్లు అటు అమిత్ షా, ఇటు మోదీ.. విజయం మాదేనని, ఫలితాల రోజున స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిల్లో పరుగులు పెడుతాయని ప్రగల్భాలు పలికారని రాహుల్ విమర్శించారు. దీనివల్ల తమ సన్నిహితుల స్టాక్స్‌కు లాభం చేకూర్చేలా కుట్రకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తొలిసారి ప్రధాని స్టాక్ మార్కెట్ల ప్రస్తావన పదేపదే తెచ్చారని, దాంతో లేని బూమ్ వచ్చిందన్నారు. .

**ఈడీతో విచారణ చేపట్టాలి**

జూన్ 4న ఏర్పడ్డ స్టాక్ మార్కెట్ నష్టాలపై ఈడీతో దర్యాప్తు చేపట్టాలని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజిత్ సేథ్‌కు రాసిన లేఖలో మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ డిమాండ్ చేశారు. ఈ భారీ నష్టాలతో చిన్న మదుపరులు కుదేలయ్యారని, ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఆ రోజు నష్టాలు రికవరీ కాలేదన్నారు. దీని వెనుక ఉన్న కారణాలు తెలియాలన్నారు.

**సెబీతో దర్యాప్తు చేయాలి**

అక్రమ పద్ధతిలో స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేసేలా వచ్చిన ఎగ్జిట్ పోల్స్‌పై మార్కెట్ రెగ్యులేటర్ సెబీ విచారణ జరుపాలని అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) డిమాండ్ చేసింది. ఈ ఎగ్జిట్ పోల్స్ అంచనాలతోనే జూన్ 3న మదుపరులు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారని, జూన్ 4న అంతా నష్టపోయారని సెబీకి రాసిన తన లేఖలో టీఎంసీ నేత సాకేత్ గోఖలే ఆరోపించారు.